ప్రజాశక్తి

మంగళవారం 31 జనవరి 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

విజయవాడ ఎంబివికెలో అభివాదం చేస్తున్న నేతలు

మచిలీపట్నంలో ర్యాలీ దృశ్యం

విశ్రమించేది లేదు

ప్రత్యేక హోదాపై విద్యార్థి, యువజన సంఘాల నేతలు
కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల మీదుగా సాగిన సమర యాత్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కష్ణా), విజయవాడ అర్బన్, గన్నవరం : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే వరకు విశ్రమించేది లేదని విద్యార్థి, యువజన సంఘాల రాష్ట్ర నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 25న హిందూపురం నుండి ప్రారంభమైన ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమర బస్సు యాత్ర సోమవరం కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల మీదుగా సాగింది. ఆదివారం రాత్రి కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో బస చేసిన యాత్ర బృందం సోమవారం ఉదయం మచిలీపట్నం నుండి ప్రారంభమైంది. ఈ సందర్భంగా రేవతి సెంటర్ నుండి కోనేరు సెంటర్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోనేరు సెంటర్లో సభ జరిగింది. అనంతరం ఈ యాత్ర ఉయ్యూరు మీదుగా మధ్యాహ్నం విజయవాడ చేరుకుంది. బస్సు యాత్ర బెంజిసర్కిల్ వద్దకు చేరుకోగానే విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజా సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుండి ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా గవర్నరుపేటలోని ఎంబి విజ్ఞాన కేంద్రం వద్దకు వచ్చారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని హామీలను తక్షణమే అమలు చేయాలని నినాదాలు చేశారు. ఎంబి విజ్ఞాన కేంద్రంలో సభ అనంతరం యాత్ర గన్నవరం వెళ్లింది. గాంధీబొమ్మ సెంటర్లో ఘన స్వాగతం లభించింది. అక్కడియాత్రం హనుమాన్‌జంక్షన్ మీదుగా ఏలూరు వెళ్లింది. ఈ కారక్రమాల్లో నేతలు మాట్లాడుతూ ప్రత్యేక హోదాను సాధించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నారా లోకేష్ చేస్తున్న యువగలం పాద యాత్రలో ప్రత్యేక హోదా, విభజన హామీల గురించి కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఈ యాత్ర (మిగతా 6లో)

ప్రతి నీటి బొట్టుకూ రేటే

విజయవాడలో మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం
'అమృత్' పేరుతో ప్రజలపై భారం

ప్రజాశక్తి-విజయవాడ : అమృత్ పథకం పేరుతో నగర ప్రజలపై పెనుభారం మోపడానికి విజయవాడ నగరపాలక సంస్థ సిద్ధమైంది. 24ఇంటూ7 పేరుతో ప్రతి ఇంటికీ నీటి మీటర్లు బిగించి వినియోగం ఆధారంగా ఛార్జీలు వసూలు చేస్తారు. మంచినీటి సరఫరా నిర్వహణకు అయ్యే ఖర్చును నగర ప్రజల నుంచి రాబట్టడాని నగరంలో కొన్ని సంస్థలపై ఇప్పటికే నీటి భారం మోపగా, మధురానగర్ పసుపుతోటలో నీటి మీటర్లను బిగిస్తున్నారు. నగరంలో నీటి మీటర్లు లేని కుళాయిలు 1,17,069 ఉండగా, మీటర్లు ఉన్న కుళాయిలు 8,617 ఉన్నాయి. మరో 1509 పబ్లిక్ ట్యాప్‌లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు మొదటి విడతగా ప్రతి సర్కిల్ పరిధిలో ఎనిమిది డివిజన్ల చొప్పున మూడు సర్కిళ్లలోని 24 డివిజన్లలో 23,420 నీటి కుళాయిలకు నీటి మీటర్లు బిగించడానికి చర్యలు ప్రారంభించారు. అయితే అమృత్ పథకం కాల పరిమితి 2015-16 నుంచి 2019-2020 వరకు ఐదేళ్లు ముగిసింది. అమృత్ పథకం కింద కేంద్ర, (మిగతా 6లో)

నేడు విఎంసి కౌన్సిల్ సమావేశం

విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరుగుతుంది. 128 అంశాలు, 9 ప్రశ్నలతో కూడిన అజెండాను ఇప్పటికే సభ్యులకు పంపిణీ చేశారు. అజెండాపై కౌన్సిల్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి, సిపిఎంలు వేర్వేరుగా చర్చించుకుని ఓ నిర్ణయానికి వచ్చాయి.

నేడు గన్నవరం బాలోత్సవం

వార్త 6లో



విజయవాడ, మచిలీపట్నంలలో చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్లు ఎస్.డిల్లీరావు, పి.రంజిత్ బాషా

జగనన్న చేదోడు జమ

కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో 27,371 మందికి
రూ.10.79 కోట్లు పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కష్ణా) : రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్ వత్తుల వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు జగనన్న చేదోడు పథకం ఉపయోగపడుతుందని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా వినుకొండ నుంచి జగనన్న చేదోడు మూడో విడత లబ్ధిదారులకు సోమవారం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈసందర్భంగా మచిలీపట్నం కలెక్టరేట్ నుంచి కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, విజయవాడ కలెక్టరేట్ నుండి ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, ఎంఎల్‌ఎ మల్లాదివిష్ణువర్ధన్ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ఉమ్మడి కష్ణాజిల్లాలో 2020-21లో మొదటి విడతగా 29,827 మందికి రూ.29.83 కోట్లు, 2021-22లో రెండో విడతగా 28,448 మందికి రూ.28.45 కోట్లు, ఈ ఏడాది కృష్ణాజిల్లాలో మూడో విడతగా 10,788 మందికి రూ.10.79 కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. 2022-23లో 7,144 మంది టైలర్లకు రూ.7.14 కోట్లు, 2,096 మంది రజకులకు రూ.2.10 కోట్లు, 1,548 మంది నాయీ బ్రాహ్మణులకు రూ.1.55 కోట్లతో కలిపి మొత్తం రూ.10.79 కోట్ల చెక్కును కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి రీజనల్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి, సోషల్ వెల్ఫేర్ డీడీ కె.సరస్వతి, బీసీ వెల్ఫేర్ డీడీ సిహెచ్.లక్ష్మీదుర్గ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ఫణీ దూర్జేటి తదితరులు పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఈ ఏడాది 16,583 మందికి రూ.16.59 కోట్లు జమ చేసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. 11,356 మంది దర్జీలకు రూ.11.36 కోట్లు, 3,576 మంది రజకులకు రూ.3.58 కోట్లు, 1651 మంది నాయి బ్రాహ్మణులకు రూ.1.65 కోట్లు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. 2020-21లో మొత్తం 15,700 మందికి రూ.15.70 కోట్లు, 2021-22లో మొత్తం 15,035 మందికి రూ.15.04 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. రెండేళ్లలో 30,735 మందికి రూ.30.73 కోట్లు అందించామని వివరించారు. కార్యక్రమంలో డిప్యూడి మేయర్లు అవుతు శైలజారెడ్డి, బెల్లం దుర్గ, విశ్వబ్రాహ్మణ, గౌడ, నాయిబ్రహ్మణ, బటరాజు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు తోలేటి శ్రీకాంత్, కనకరావు, శిమరామ కృష్ణ, గీతాంజలిదేవి, జిల్లా గంధలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ పాల్గొన్నారు.



స్థానికంగానే నివేశనా స్థలాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: విజయవాడ రూరల్‌లోని పి.నైనవరం గ్రామ పేదలకు నివేశనా స్థలాలు గ్రామంలోనే చూపాలని సచివాలయ కార్యదర్శి చెన్నకేశవకు సోమవారం వినతిపత్రం అందజేశారు. 286 మందికి గ్రామానికి దూరంగా ఉన్న పాతపాడు లేఅవుట్‌లో ఇళ్లపట్టాలు ఇచ్చారని, గ్రామ పరిధిలోనే ఇళ్లస్థలాలు ఇవ్వాలని రైతు సంఘం నాయకులు మాతంగి ఆంజనేయులు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు చట్టు శ్రీను, అజయ్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్‌లో ఈశ్వర్‌కు కాంస్య పతకం

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు కర్నూల్‌లోని మాంటిస్సోరి ఏ క్యాంప్‌లో బాలుర, బాలికల అండర్-14, అండర్-17 విభాగాల అంతర్ జిల్లాల ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. అండర్-17 కేటగిరిలో నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దాసరి రామ్‌చంద్ శ్రీ ఈశ్వర్‌కు కాంస్య పతకం లభించింది. అండర్-17 బాలుర విభాగం ఫాయల్‌లో కృష్ణాజిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. ఆ జట్టుకు రామ్‌చంద్ శ్రీ ఈశ్వర్ ప్రాతినిధ్యం వహించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని, వ్యాయామ ఉపాధ్యాయులు ముత్యాల వెంకటేశ్వరరావు, విజయ్ వర్మలను ప్రధానోపాధ్యాయులు వజ్రాల భూపాల్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మున్సిపల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి-నందిగామ: అజెండా కాపీ ఇవ్వకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని నందిగామ నగర పంచాయతీ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని వాపోయారు. సోమవారం సమావేశం నిర్వహించడానికి అధికారులు ప్రయత్నించడంతో వరలక్ష్మి సమావేశాన్ని వాయిదా వేయాలని కమిషనర్‌ను కోరారు. దీంతో ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్లు సమావేశ మందిరం నుంచి బయటికి వెళ్లారు. దీంతో సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎస్.జయరాం చైర్‌పర్సన్ అనుమతితోనే మున్సిపల్ బడ్జెట్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అజెండా కాపీ ఈనెల 21వ తేదిన చైర్మన్‌కు పంపించామని, ఆమె అటెండర్ అజెండా కాపీ తీసుకున్నారని తెలిపారు. అజెండా కాపీ పంపలేదనే దానిలో వాస్తవం లేదన్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న వరలక్ష్మి

విజేతలకు సన్మానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఈ నెల 18వ తేదీన మధిర సిమ్మర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈతల పోటీల్లో జగ్గయ్యపేట, కృష్ణ స్విమర్స్, డ్రీమర్స్ స్విమ్మర్స్ పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. అలాగే విశాఖపట్నంలో నేషనల్ పవర్‌లిఫ్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన బెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్ ఛాంపియన్ షిప్‌లో పలువురు విజేతలుగా నిలిచారు. గెలుపొందిన విజేతలకు కృష్ణ స్విమ్మర్స్ ఆధ్వర్యంలో సోమవారం ముక్త్యాలలో స్విమర్స్ బిల్డింగ్ దగ్గర ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పిన్నెల్లి పాండురంగారావు, సెక్రటరీ కోటేశ్వరరావు, కోశాధికారి హుస్సేన్, జివి మహేష్, మార్షల్ స్టాలిన్, సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాలుగు రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో 14 కోట్ల రూపాయలతో వైయస్సార్ విగ్రహం నుండి చిల్లకల్లు వరకు ఫోర్ లైన్ నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గ అభివద్ధి లక్ష్యంగా పలు కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఫోర్ లైన్ నిర్మాణ పనులు త్వరలో పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ నిర్మాణ పనులు చేపట్టే కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

కౌన్సిల్ సమావేశాలకు మీడియాను అనుమతించాలి

ప్రజాశక్తి-విజయవాడ: దేశంలో ఎక్కడా లేని రీతిలో విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశాలకు మీడియాను అనుమతించకపోవడం అప్రజాస్వామికమైన చర్య అని, మంగళవారం జరుగుతున్న కౌన్సిల్ సమావేశానికి ఎటువంటి నియంత్రణ విధించకుండా మీడియాను అనుమతించాలని ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి సాంబిరెడ్డి, యంవి ఆంజనేయులు కోరారు. స్థానిక బెల్లపు శోభనాద్రి గ్రంథాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కౌన్సిల్ సమావేశం సందర్భంగా సభ్యుల మధ్య జరుగుతున్న చర్చల సారాంశాన్ని తెలుసుకునే హక్కు నగర ప్రజలకు ఉందన్నారు. కౌన్సిల్ సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేయించాలని కోరారు. నగరంలో ఒక ప్రాంతంలో ఫుట్‌పాత్‌ల నిర్మాణాల కోసం గతంలో కౌన్సిల్ ఆమోదించిన తీర్మానాలను రద్దు చేసి, రాజకీయ పలుకుబడితో మరో ప్రాంతంలో ఫుట్‌పాత్‌లు నిర్మించాలని కౌన్సిల్‌లో ప్రతిపాదించడాన్ని వ్యతిరేకించారు. ఇరపక్కల నివాస గృహాలతో, అత్యధిక జన సంచారంతో ఉండే కెటి రోడ్డులో ఫుట్‌పాత్‌ల అవసరం ఎంతైనా ఉందన్నారు. గురునానక్ రోడ్డులో ఫుట్ పాత్‌ల నిర్మాణం కోసం ఆమోదించిన పనులను రద్దు చేసి ఆ నిధులను పాలీ క్లినిక్ రోడ్డులో రోడ్డు నిర్మాణం కోసం వాడాలన్న ప్రతిపాదనను కౌన్సిల్ ముందు ఉంచారన్నారు. ఒక ప్రాంత ప్రజల సౌకర్యం కోసం మంజూరైన పనులను రద్దు చేసి ఇంకొక చోటకు తరలించాలనుకోవడం తగదన్నారు. ఇటువంటి ప్రజావ్యతిరేక ప్రతిపాదనలను పార్టీలకతీతంగా కౌన్సిల్ సభ్యులు తిరస్కరించాలని కోరారు. సితారా జంక్షన్ నుండి గొల్లపూడి వై జంక్షన్ వరకు గల బైపాస్ రోడ్డు ఫుట్ పాత్‌లకు, పాలీ క్లినిక్ రోడ్డు కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులను చేపట్టాలన్నారు. చిట్టినగర్ నుండి కేదారేశ్వరపేట వైపుకు వచ్చే ఎర్రకట్ట రహదారిని విస్తరించి, చిట్టినగర్ నుంచి బిఆర్‌టిఎస్ రోడ్డును కలుపుతూ రైల్వే ట్రాక్ మీదుగా నాలుగు లైన్ల రోడ్డును నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో విఎస్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టాక్స్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు

సాగు భూములకు పట్టాలివ్వాలని వినతి

ఆర్‌డిఒ రవీంద్రరావుకు వినతిపత్రం అందజేస్తున్న పేదలు

ప్రజాశక్తి-నందిగామ: పెద్దవరం-చెరువుకొమ్ముపాలెం గ్రామంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం నందిగామ ఆర్డిఓ రవీంద్రరావుకు స్పందనలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ ఖాసిం మాట్లాడుతూ 1959 నుండి జమీందారు దగ్గర నుండి కొనుగోలు చేసిన భూమి ఆర్ఎస్ 667, 668, 669 సర్వే నెంబరులో 90 మంది సాగు చేసుకుంటున్న లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. ఎస్సి, ఎస్టి వర్గాలకు చెందిన పేద రైతులు ఉన్నారని, వీరికి ప్రభుత్వం గత భూ పంపిణీలో పట్టాలు ఇవ్వలేదని, సదరు భూమిని పరిశీలించి లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కటారపు గోపాల్, నాయకులు బి.బాలకోటినాయక్, బి.వెంకటేశ్వర్లు, కారం రమేష్, బాలు నాయక్, సాయికుమార్, సూక్యా నాయక్, చినబాలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల రద్దుపై కౌన్సిల్లో ప్రశ్నిస్తా : సత్యబాబు

ప్రజాశక్తి-వన్‌టౌన్: తప్పుడు కారణాలతో వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళల పెన్షన్లు రద్దు చేసి వారిని తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్న అంశాలపై బుధవారం జరుగుతున్న విజయవాడ నగర కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదన రూపంలో చర్చకు చేపట్టి పెన్షన్‌దారుల సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువచ్చే విధంగా కృషిచేస్తానని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలిపారు. డివిజన్‌కు చెందిన వికలాంగుడు గరిక ఆంజనేయులు గత రెండు సంవత్సరాల నుండి సొంతిల్లు 300 యూనిట్లకు మించి విద్యుత్ వాడుతున్నారని పెన్షన్ రద్దు చేయడంపై సోమవారం బాధితుడిని సత్యబాబు కలిశారు. నగర వ్యాప్తంగా నాలుగు వేల మంది పెన్షన్లు రద్దు చేసి తీవ్ర అన్యాయం చేస్తున్నారని, పెన్షన్‌దారులకు న్యాయం జరిగే వరకూ సిపిఎం వారి అండగా ఉండి పోరాడుతుందని సత్యబాబు తెలిపారు.

బిఎఐ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిఎఐ) అమరావతి ఛాప్టర్ ఆధ్వర్యంలో 2023 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నగరంలోని హోటల్ మినర్వాలో జరిగింది. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ ఎస్.రమేష్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ జె.రామకృష్ణ డైరీని ఆవిష్కరించారు. అనంతరం 2023-24 సంవత్సరానికి సంబంధించి బిల్డర్స్ అసోసియేషన్ అమరావతి ఛాప్టర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. చైర్మన్‌గా టి.పానకాలరావు, ప్రధాన కార్యదర్శిగా బలివాడ శివకుమార్ పట్నాయక్, కోశాధికారిగా ప్రభు శశాంక్, వైస్ చైర్మన్‌గా పవన్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా ఎస్.కె. సంయుద్దీన్ రాజా, జాయింట్ సెక్రటరీగా కెవిఎస్ఎన్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి బిఎఐ చైర్మన్ ఎ.నాగమల్లేశ్వరరావు అధ్యక్షత వహించగా బిఎఐ ఎపి చైర్మన్ రంగారావు, వి.వెంకటేశ్వరరావు, బి.అమరనాథ్, పవన్ కుమార్, పూర్ణ చంద్రరావు, టి.వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామంలో సోమవారం చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట ఏడిఏ సిహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో తక్కువ ఎరువులు, పురుగు మందులు వాడుకతో అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చిరుధాన్యాలు కొనుగోలు కేంద్రాలు రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసి క్వింటాకు 2500 రూపాయలు మద్దతు ధర కల్పిస్తుందని, అదే విధంగా పంటల భీమా కూడా వర్తిస్తుందని, చిరుధాన్యాలు సాగు చేసే రైతులను క్లస్టర్ గా ఏర్పాటు చేసి ప్రతి క్లస్టర్‌కు రూ.6 వేలు చొప్పున వివిధ వనరులు వ్యవసాయ పనిముట్లు రాయితీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులందరూ చిరుధాన్యాల సాగుపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త డాక్టర్ వెంకట సుబ్బయ్య, శివప్రసాద్, మండల వ్యవసాయ అధికారి వి.వరలక్ష్మి, ఏఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-విజయవాడ రూరల్:** నున్న రైతు భరోసా కేంద్రంలో చిరు ధాన్యాల సాగుపై రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు గూర్చి మెళకువలను తెలుసుకొని, చిరుధాన్యాలు సాగు చేయుటకు గ్రామ రైతులు ముందడుగు వేయాలని వేయాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారి చంద్రకళ మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి ఈ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిదన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ డివిజన్ ఏడి వెంకటేశ్వరరావు, ఎఓ రంగనాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నున్నలో మాట్లాడుతున్న చంద్రకళ

సంగీత పోటీల్లో సిద్ధార్థ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: మద్రాసు మ్యూజిక్ అకాడమి నిర్వహించిన కర్ణాటక సంగీత పోటీలలో నగరంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ కనపరచి బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ తెలిపారు. తమ కళాశాలలో జూనియర్ ఇంటర్ ఎంఇసి చదువుతున్న ఎం.సింధు రాజేశ్వరి ఈ నెల 21వ తేదీన చెన్నయ్‌లోని మద్రాసు మ్యూజిక్ అకాడమి పోటీలలో పాల్గొందని తెలిపారు. కర్ణాటక గాత్ర సంగీత విభాగంలో టైమ్స్ త్యాగరాజు అవార్డును సాధించినట్లు తెలిపారు.

ఒకటిన యుకె అడ్మిషన్స్ డే

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: నగరంలో యూనిఏక్స్ పర్ట్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి ఒకటో తేదీ బుధవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు యుకె అడ్మిషన్స్ డే నిర్వహిస్తున్నట్లు యూనిఏక్స్ పర్ట్స్ ఆపరేషన్ హెడ్ ఆంధ్రప్రదేశ్ చైతన్య వాడవల్లి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం చైతన్య మాట్లాడుతూ యుకెలో విద్యనభ్యసించాలని అనుకునే విద్యార్థుల కోసం యునిఏక్స్ పర్ట్స్ విజయవాడ ఆధ్వర్యంలో యుకె అడ్మిషన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యుకెకు చెందిన పది విశ్వవిద్యాలయాలు పాల్గొంటాయని తెలిపారు. స్కాలర్‌షిప్ విధానం గురించి తెలుసుకొని స్పాట్ అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8978787855 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్లాస్టిక్ కవర్ల వాడకంపై డ్రైవ్

ప్రజాశక్తి-కంచికచర్ల: భావితరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత తీసుకోవాలని ఈఓఆర్డీ బి. శ్రీనివాసరావు, కార్యదర్శి కనగాల రవికుమార్ తెలిపారు. సోమవారం జుజ్జూరు రోడ్డులో, బస్ స్టాండ్ పరిసరాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ వ్యాపార దుకాణాలలో స్పెషల్ డ్రైవ్ సందర్భంగా ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని, 22,500 రూపాయలు జరిమానా రూపంలో వసూలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లా సుబ్బారావు, నాగులు మీరా, బెజ్జం భూషణం పాల్గొన్నారు.

3న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : గన్నవరం నియోజక వర్గం తేలప్రోలులో ఉషారామ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఫిబ్రవరి 3వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఎస్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, ఎస్ఈఈడిఏపి సంయుక్త ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం సంకల్ప్ పథకం కింద నిరుద్యోగులకు జాబ్ మేళ నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు శుక్రవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. సంబందించిన గోడ ప్రతులను సోమవారం, మచిలీపట్నంలోని కలెక్టరేట్లోని స్పందన హాలులో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, జియామోటార్స్, హెటురోలాబ్స్, ముతూట్ ఫైనాన్స్, గోల్డ్ ప్రిన్స్, జ్యుయల్ ఇండస్ట్రీ ఇండియా, అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్, మోహన్ స్పిన్ టెక్స్, వీటియం, బిగ్ బాస్కెట్, నవత రోడ్ ట్రాన్స్ పోర్ట్ తదితర 15 ప్రముఖ కంపెనీల పాల్గొంటాయన్నారు. ఉద్యోగాలకు ఎస్ఎస్సి, ఐటిఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. ఆసక్తి తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా హ్ట్రజూం://తీఎ స్త్రఎ/ష్ట్రఇశ్రీ3ష్ట్రఎ లింక్లో తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. బయోడేటా, ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో జాబ్ మేళాలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9000873223, 70134144747 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

అక్రమ తవ్వకాలపై విచారణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం నియోజకవర్గ గోపువాని పాలెంలో అక్రమ ఇసుకతవ్వకాలు నిలిపి వేయాలని కోరుతూ దాఖలు అయినా రిట్ పిటిషన్లో కృష్ణా జిల్లా కలెక్టర్ తీసుకున్న చర్యలు తెలియపరచాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. సముద్ర తీర ప్రాంతంలో నివసిస్తున్న గోపువాని పాలెం గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకాలు వలన, తమకు సముద్రం వల్ల ముప్పు ఉందని, అక్రమ తవ్వకాలు నిలిపివేయాలని గోపువాని పాలెం చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పేపర్లో ప్రచురించిన కథనాలను కూడా పిటిషనర్లు హైకోర్టు దష్టికి తీసుకువచ్చారు. కేసు విచారణ స్వీకరించిన రాష్ట్ర హైకోర్టు ఈ విషయంపై కలెక్టర్ ఏం చర్యలు తీసుకున్నారో హైకోర్టు తెలియపరచాలని కేసు ఫిబ్రవరి 6వ తేదీకి వాయిదా వేశారు.

ఐఎంఎ అధ్యక్షులు పాలడుగుకు పితృయోగం

ప్రజాశక్తి-గుడివాడ : ప్రముఖ వైద్యులు, గుడివాడ ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ పాలడుగు వెంకట్రావు తండ్రి డాక్టర్ పాలడుగు కృష్ణమూర్తి సోమవారం మృతిచెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాదపడుతున్న పాలడుగు కృష్ణమూర్తి మృతి చెందడంతో పట్టణంలోని పలువురు డాక్టర్లు పాలడుగు కృష్ణమూర్తి మృత దేహనికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు.

చిన్నారి వైద్యానికి సాయం

ప్రజాశక్తి-గుడివాడ : టి.బి వ్యాధితో వ్యాధితో బాదపడతున్న చిన్నారి వైద్యం నిమిత్తం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. సోమవారం స్థానిక రాజేంద్రనగర్లోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి స్వగృహంలో ఈ మేరకు పట్టణానికి చెందిన కుటుంబానికి రూ.50వేలు అందజేశారు. అనంతరం పలువురు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న కొడాలి నాని

జమీల్ ఆకస్మిక మృతికి సంతాపం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

వీరమ్మతల్లి ఆటోస్టాండ్ ప్రెసిడెంట్ జమీల్ తోట్లవల్లూరు మండలం పెనమకూరు గ్రామంలో తన నివాసంలో సోమవారం రాత్రి 12 గంటలకు గుండెపోటుతో మృతి చెందారు. ఈయన గత మూడు నెలల నుంచి వీరమ్మ తల్లి ఆటో స్టాండ్ ఉయ్యూరు టు ఐనపూర్ స్టాండ్ కి ప్రెసిడెంట్గా వ్యవహరిస్తున్నారు. జమీల్ భౌతికకాయానికి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాజేష్ ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉయ్యూరు మండల కార్యదర్శి సజ్జ బాల గంగాధర్, అమ్మ ఆటో స్టాండ్ కార్యదర్శి రామారావు, మదర్ తెరిసా కార్యదర్శి సయ్యద్ బాజీ, వీరమ్మ తల్లి ఆటో స్టాండ్ కార్యదర్శి బి కోటేశ్వరరావు, కోశాధికారి జె సుందరం, సభ్యులు నిమ్మకూరు రాజేష్ చిత్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ అవగాహన పక్షోత్సవాలు ప్రారంభం

ఉయ్యూరులో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : 'కుష్టు వ్యాధితో పోరాడదాం-కుష్టు వ్యాధిని గత చరిత్రగా మార్చేద్దాం' నినాదంతో ప్రభుత్వం లెప్రసీ అవగాహన పక్షోత్సవాలు చేపట్టినట్లు మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని మంగళాపురం పంచాయతీలో లెప్రసీ వక్షోత్సవాలను సర్పంచ్ సోమవారం ప్రారంభించారు. మండల లెప్రసీ నోడల్ సూపర్ వైజర్ తోట సుధాకరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కే.విజయరావు లెప్రసీ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, పురిటిగడ్డ పీ.హెచ్.సీ హెల్త్ విజిటర్ స్వర్ణ కుమారి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** కుష్టు వ్యాధిపై ప్రజలో అవగాహన కల్పించాలని డాక్టర్ తేజస్విని అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకుని కుష్టువ్యాధిపై అవగాహన స్పర్శ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పాల్గొని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా పలు సూచనలు చేశారు. నగరపంచాయతీ వైస్ చైర్మన్ సోలె సురేశ్, 6వ వార్డు కౌన్సిలర్ గోన మధన్, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాయవరంలో 'గడపగడపకూ మనప్రభుత్వం'

ప్రజాశక్తి-గూడూరు : ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందరికీ చేరాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గూడూరు మండల రాయవరం గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమ పాలన అందించడమే తమ ముఖ్య లక్ష్యం అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఇప్పటికి 98.4 శాతం హామీలు అమలు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయవరం గ్రామ సర్పంచ్ నందం మల్లేశ్వరి రవికిరణ్, పిఏసిఎస్ అధ్యక్షులు కోళ్ల వీర వెంకట బాలకష్ణ , వైఎస్ఆర్సిపి గూడూరు మండల ఉపాధ్యక్షులు కోళ్ల వీర వెంకట నాంచారయ్య, రాయవరం ఆర్బికే చైర్మన్ ఉప్పలపు రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీలో ఆదర్శంగా నిలవాలి : మంత్రి

ప్రజాశక్తి-పెడన : పెన్షన్ల పంపిణీలో పెడన నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పెడన పట్టణం మార్కెట్ కమిటీ కార్యాలయం సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి జగనన్న సచివాలయ కన్వీనర్లు, ముఖ్య నాయకులు దాదాపు 400 మందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ పెడన నియోజకవర్గ పరిధిలోని 76 సచివాలయాల్లో ఒక్కొక్క సచివాలయానికి ముగ్గురు చొప్పున కన్వీనర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, మరోవైపు వాలంటీర్లకు అనుబంధంగా ఇద్దరు గహ సారథులు పర్యవేక్షణలో మొత్తం 32 వేల 515 మందికి పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు సీనియర్ కార్యకర్తలు మరియు సచివాలయ కన్వీనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టిడిపి నేతలపై ఎంఎల్ఏ వంశీ పరువు నష్టం దావా

ప్రజాశక్తి-గన్నవరం : టిడిపి నేతలు పట్టాభి, బచ్చుల అర్జునుడిపై గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ పరువు నష్టం దావా వేశారు. సోమవారం గన్నవరం 12వ అదనపు న్యాయస్థానంలో హాజరైన ఆయన సంకల్ప సిద్ధి వ్యవహారంలో తన పాత్ర ఉందని, ఆ డబ్బుతో బెంగుళూరులో ఆస్తులు కొన్నారంటూ తెదేపా నేత పట్టాభి చేసిన నిరాధార ఆరోపణలు తన ప్రతిష్టకు భంగం కల్గించాయంటూ పరువు నష్టం దావా దాఖలు చేసారు. అనంతరం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... సంకల్ప సిద్ధి సంస్థతో తనకు ఏ విధమైన సంబంధం లేదని, పట్టాభి కావాలనే రాజకీయంగా తనపై బురద చల్లాలని ఉద్దేశంతో లేనిపోని ఆరోపణలు చేశారని, సామాజిక మధ్యమాల్లో, పేపర్లలో లేనిపోని కథలు రాయించారని చెప్పారు. రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు, పేరు ఉన్నాయని వాటికి భంగం కలిగించేలా వ్యవహరించిన పట్టాభి తీరుపై కోర్టులో పరువు నష్టం వేసినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో కొంతమంది వ్యక్తులు, శక్తులు హైదరాబాదు కేంద్ర కార్యాలయంలో కూర్చుని ఇష్టానుసారంగా లేనిపోని విమర్శలు ఆరోపణలు చేసి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి వ్యక్తులను ప్రజలు క్షమించరన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ పేదలకు వరం

ప్రజాశక్తి-చల్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్య క్రమం పేదలకు వరంగా మారుతోందని వైద్యాధికారి డాక్టర్ కె.విజయ రావు అన్నారు. సోమవారం చల్లపల్లి మండలం మంగ ళాపురం పంచాయతీలో జగనన్న హెల్త్ క్లినిక్ లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, వద్ధులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. మంచానికి పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి రోగులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ తోట సుధాకరరావు, హెల్త్ విజిటర్ స్వర్ణకుమారి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ దినేష్, హెల్త్ అసిస్టెంట్ వి.రాంబాబు, ఏఎన్ఎం నాగకుమారి ఉన్నారు.

జోడోయాత్ర ప్రజలతో మమేకమై సాగింది : కాంగ్రెస్

జెండా ఆవిష్కరిస్తున్న తాంతియాకుమారి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ప్రజలతో మమేకమై సాగిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు లాంమ్ తాంతియా కుమారి అన్నారు. సెప్టెంబర్ 7 న తమిళనాడులోని కన్యా కుమారిలో ప్రారం భమై సోమవారం కాశ్మీరులోని శ్రీనగర్ లాల్ చౌక్లో ముగించుకుని రాహుల్ గాంధీ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ యాత్ర 145 రోజులు, 12 రాష్ట్రలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలు, 75 జిల్లాలు, 4080 కిలోమీటర్లు సాగడం చాలా గొప్ప అనుభూతి అన్నారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్మా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిపిసిసి సెక్రటరీ మొహమ్మద్ దాదా సాహెబ్, మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఫిరోజ్ బేగ్, డిసిసి మైనారిటీ సెల్ చైర్మన్ షేక్ ఖాన్ భాష, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విఆర్ఓ మృతి

ప్రజాశక్తి-మోపిదేవి: గ్రామ రెవిన్యూ అధికారి మేరుగ మోహనరావు గుండెపోటుతో ఆకస్మికంగా మతి చెందారు. మోపిదేవి మండల పరిధిలోని నాగాయతిప్ప గ్రామానికి చెందిన మోహనరావు కె కొత్తపాలెం విఆర్ఓ గా పనిచేస్తున్నారు. నాగాయతిప్పలోని తన స్వగృహంలో మోహనరావుకు ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మృతిచెందారు. గత కొద్ది రోజుల క్రితం కొక్కిలిగడ్డ రోడ్డులో మోహనరావుకు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. దీనితో ఆయన ఇంటి వద్ద ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు విఆర్ఓ మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

కుష్టు వ్యాధి నివారణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: జిల్లాలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వైద్య సహాయం అందించి కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు అన్నారు. కుష్టు వ్యాధి నివారణ అవగాహనకు నిర్వహించే 'స్పర్శ' కార్యక్రమాన్ని పురస్కరించుకొని కుష్టు వ్యాధి లక్షణాలపై వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన పోస్టర్లను, కరపత్రాలను సోమవారం స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అవసరమైన అన్ని చర్యలను తీసుకోవడం జరిగిందన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న రోగులను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య సహాయం అందించగలిగితే వ్యాధిని త్వరగా నివారించవచ్చన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరి 13వ తేదీ వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు ప్రతి ఆరోగ్య కేంద్రంలోను ఆరోగ్య కార్యకర్త వద్ద యండిటి మందులను అందుబాటులో ఉంచి ఉచితంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం కుష్టు, టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, డిఆర్వో కె.మోహన్‌కుమార్, డిఎంహెచ్వో డాక్టర్ ఎం సుహాసిని, జిల్లా లెప్రసి ఎయిడ్స్ టిబి అధికారిణి జె.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సత్కారం

ప్రజాశక్తి-వత్సవాయి: ఇటీవల విజయవాడలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంసా పత్రాలు అందుకున్న తహశీల్దార్ వై.వైకుంఠరావు, ఎంపీడీవో ఎస్వి ప్రసాద్, హౌసింగ్ ఏఈ చిదంబరేశ్వరరావులను మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

వైసిపికి రోజులు దగ్గరపడ్డాయి : సౌమ్య

ప్రజాశక్తి-కంచికచర్ల: రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనను రోజులు దగ్గర పడ్డాయని నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య విమర్శించారు. సోమవారం స్థానిక చెవిటికల్లు రోడ్డు నుండి ప్రభాకర్ క్లినిక్ వరకు ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను, అరాచక పాలనను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, మాజీ ఎంపిపి అల్లడి కోటేశ్వరరావు, నాయకులు గుర్రం రామకష్ణ, మన్నే సాత్విక, రొంపిచర్ల శ్యాం, బర్రె వాసు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి-సింగ్‌నగర్: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా అజిత్ సింగ్‌నగర్ పరిధిలోని 58వ డివిజన్ పైపులు రోడ్డు సెంటర్లో సోమవారం ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. సిఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-గంపలగూడెం: వార్షిక తనిఖీలో భాగంగా సోమవారం మండలంలోని వినగడప యుపి పాఠశాలను స్థానిక ఎంఈఓ బి.సోమశేఖర్‌నాయక్ తనిఖీ చేశారు. రిజిష్టర్లు, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల బోధన తీరు, లెసన్ ప్లాన్ పుస్తకాలు తదితర అన్ని అంశాలను పరిశీలించి సంతప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్‌కె జానీబాష తదితరులు పాల్గొన్నారు.

ఆల్ సైన్స్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు ఆల్ సైన్స్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఉన్నత విద్యను అందిస్తున్న ఆల్ సైన్స్ లాంటి అన్ని పాఠశాలలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: వికాస్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆనందకుమార్ మాట్లాడుతూ నిషేధిత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల మత్తులో జీవితాలు పాడు చేసుకోవద్దన్నారు. శరీరంలో ప్రధాన అవయవాలైన గుండె, మెదడు, లివర్, ఊపిరితిత్తుల పని తీరు మందగించే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి శ్రీనివాస్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తిరువూరు:** స్థానిక శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో పోలీసులు విద్యార్థులకు మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రుద్రరాజు భీమరాజు మాదకద్రవ్య రహిత సమాజంలో విద్యార్థుల పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సిహెచ్.దుర్గాప్రసాద్, ఎ.పద్మారావు డాక్టర్ పి.భానుతేజ, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గంపలగూడెం:** విద్యార్థి దశలో డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నష్టపరుచుకోవద్దని తిరువూరు సిఐ రుద్రరాజు తెలిపారు. సోమవారం నాడు డ్రగ్స్ నివారణ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ధీరు డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి శ్రీనివాస్, ఎంపిహెచ్ఓ రాధాకష్ణ పాల్గొన్నారు.

గంపలగూడెంలో...

2న సింటెల్లా 4.0 మెగా ఈవెంట్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, భౌతిక శాస్త్ర విభాగం, స్టూడెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న సింటెల్లా 4.0 పేరుతో ఒకరోజు రాష్ట్రస్థాయి అంతర్ కళాశాలల సాంకేతిక, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ ఫిజిక్స్ అసోసియేషన్ ద్వారా గత మూడు సంవత్సరాల నుండి నిరంతరాయంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ టి.శ్రీనివాసకృష్ణ మాట్లాడుతూ ఐస్ (పవర్ పాయింట్ ప్రజెంటేషన్), పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, గెస్ ఇట్, టెక్కీ, రెప్లికా (సైంటిఫిక్ మోడల్స్), రోల్ ప్లే (భౌతికశాస్త్ర అనుకరణ), జామ్ (జస్ట్ ఎ మినిట్), వ్యాసరచన, స్పాట్ ఫొటోగ్రఫీ, నిధి అన్వేషణ, మిస్టర్ అండ్ మిస్ సింటెల్లా వంటి అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాలతో కూడిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ సమావేశంలో శిక్షణా ఉపాధి అధికారి కావూరి శ్రీధర్, ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ పాండురంగారావు, ముస్సరీన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయవాడ: రామలింగేశ్వర్‌నగర్ 15వ డివిజన్‌లోని స్క్రూ బ్రిడ్జీ కింద నివాసముంటున్న వారికి తాత్కాలిక టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. 15 డివిజన్‌తో పాటు కృష్ణలంక 21వ డివిజన్‌లో సంబంధిత అధికారులతో కమిషనర్ పర్యటించి, పలు సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 15వ డివిజన్‌లో ఉన్న వంగవీటి మోహన రంగా పార్కులో ఉన్న షెడ్‌ను గ్రంథాలయంగా మార్చాలని డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ కమిషనర్ దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పి నరసకుమారి, చీఫ్ ఇంజనీర్ యం.ప్రభాకర్ పాల్గొన్నారు.

విషమంగానే అర్జునుడు ఆరోగ్యం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు ఆరోగ్య పరిస్థితి విషయంగానే ఉందని, వెంటిలేటర్‌పైనే అన్ని లైఫ్ సేవింగ్ సపోర్ట్సుతో చికిత్స కొనసాగుతుందని రమేష్ హాస్పటల్స్ సోమవారం రాత్రి విడుదల చేసిన బులెటిన్‌లో వైద్యులు తెలిపారు. ఈసీజీ ఫ్లాట్‌గా ఉండటంతో కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) నిర్వహించగా 15 నిముషాలు అనంతరం నాడి కొట్టుకోవడం ప్రారంభమైందన్నారు. మెననైజ్డ్ వెంటిలేటర్ మీద ఉంచి వెంటనే క్యాథ్‌ల్యాబ్‌కు తరలించి ఇంట్రా అయోటిక్ బెలూన్ పంప్ అమర్చి యాంజియోగ్రామ్ పరీక్షలో రైట్ కరనరీ ఆర్థరీకి స్టెంటు అమర్చినట్లు తెలిపారు. రమేష్ హాస్పటల్స్ చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ రమేష్‌బాబు, చీఫ్ అనస్థీషియాలజిస్టు డాక్టర్ పి.శ్రీనివాస్, క్రిటికల్ కేర్ స్పెషలిస్టు డాక్టర్ ధరణేంద్ర, నెఫ్రాలజిస్టు డాక్టర్ రమేష్ తదితర వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నారని హాస్పటల్ వైద్యులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఆంధ్రప్రదేశ్ 66వ ఇంటర్ డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌ను పట్టణంలోని ఉక్కు కళావేదికలో సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ 13 జిల్లాల నుండి 300 మంది క్రీడాకారులు, 40 మంది కోచ్‌లు పాల్గొనున్నారని, మొత్తం ఐదు రోజులు పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలలో భాగంగా నేపాల్‌లో విజయం సాధించిన జగ్గయ్యపేట స్విమ్మర్లకు చిరు సత్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పందుల రోశయ్య, వైసిపి పట్టణ నాయకులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, తన్నీరు నాగేంద్ర, దువ్వల రామకృష్ణ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి-వత్సవాయి : ఇదుకుపల్లి మున్నేరు నుండి అనుమతి లేకుండా తెలంగాణ రాష్ట్రం ముదిగొండ మండలం మాల్లారం గ్రామానికి ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను వత్సవాయి ఎస్సై అభిమన్యు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసులు కేసు నమోదు చేశారు.

28 మందికి ఉద్యోగావకాశం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఈ నెల 27వ తేదీన మొగల్‌రాజపురంలోని పిబి సిద్ధార్థ కళాశాలలో జరిగిన ఐఎల్ఎం ప్రాంగణ ఎంపికలలో శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు 28 మంది ఉద్యోగావకాశాలు సాధించారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి.విజయలక్ష్మి తెలిపారు. లబ్బీపేటలోని సిద్ధార్ధ మహిళా కళాశాలలో ఉద్యోగాలు పొందిన విద్యార్థినుల అభినందన సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ తమ కళాశాల నుండి 85 మంది విద్యార్థినులు హాజరుకాగా 28 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.కల్పన, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.హారిక అభినందించారు.

మతసామరస్యం కాపాడడం ద్వారానే గాంధీజీకి నివాళి

ప్రజాశక్తి-వన్‌టౌన్

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్మా గాంధీ మినీ క్లాత్ మార్కెట్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం మహాత్ముడికి ఘనంగా నివాళులర్పించారు. 50వ డివిజన్ కస్తూరి సీతారామయ్య స్కూల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బోయి సత్యబాబు పాల్గొని నివాళులర్పించారు. దేశ ఐక్యత కోసం మత సామరస్యం కోసం స్వాతంత్ర పోరాటంలో అగ్రభాగాన నిలిచిన మహాత్మ గాంధీ చూపిన సర్వమత సామరస్యం సందేశం నేడు దేశానికి ఎంతో అవసరమని తెలిపారు. దేశంలో మత సామరస్యాన్ని కాపాడటమే గాంధీజీకి అర్పించే నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు సర్వేశ్వరరావు, క్లాత్ మార్కెట్ అసోసియేషన్ నాయకులు బాగేశ్వరరావు ఎస్కే చినబాబు, పింకు, ఇది లీస్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. సయ్యద్ అప్పలస్వామి కళాశాల ప్రాంగణంలోని మహాత్మా గాంధీ దేవాలయంలో ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాంపిళ్ల జయప్రకాష్ ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అసిస్టెంట్ సూపరింటెండెంట్ డేగ ప్రభాకర్, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ చైర్మన్ రాంపిళ్ల జయప్రకాష్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు. తొలుత మహాత్మా గాంధీ విగ్రహానికి ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు రాంపిళ్ల నరసాయమ్మ పాలాభిషేకం చేసి పుష్పమాల వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక సత్యనారాయణపురంలో పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి స్థానిక నాయకులు పింగళిశర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.కృష్ణమూర్తి, బి.రమణారావు, ఎం.మురళి, ఇ.మోహనాచారి, సంకా మురళి, సాగర్, టి.ప్రవీణ్, ఎస్.దాస్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ దేవాలయంలో...

సత్యనారాయణపురంలో...

గ్రామదర్శినిలో గుర్తించిన సమస్యలు పరిష్కరించాలి :కలక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : జిల్లాలో 4వ విడత గ్రామదర్శిని మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందన నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ గత 3 విడతలుగా జిల్లాలో నిర్వహించిన గ్రామదర్శినిలో గుర్తించిన సమస్యలు నూరుశాతం పరిష్కరించాలన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో గ్రామ దర్శిని సమీక్షిస్తామన్నారు. మంగళవారం నిర్వహించే గ్రామదర్శిని ప్రత్యేకాధికారులు. మండల ప్రత్యేకాధికారులు గ్రామాలను సందర్శించి పాఠశాలలు, అంగన్వాడీలు, హాస్టళ్లు, ఆస్పత్రులు సందర్శించి వాటి పనితీరు పరిశీలించాలని ఆదేశించారు.

కుష్టువ్యాధి అవగాహన కార్యక్రమం కరపత్రాలు విడుదల

సమాజంలో కుష్టువ్యాధి వ్యాధిగ్రస్థులపట్ల వివక్ష చూపకూడదని వారిని జన జీవన స్రవంతిలోకి తేవడానికి అన్ని విధాల కషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు.ఈ నెల 30 నుండి ఫిబ్రవరి 13 వరకు జిల్లాలో కుష్టువ్యాధి నివారణ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా కలెక్టరు అధికారులతో ప్రతిజ్ఞ చేయించి పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కుష్టువ్యాధి సోకిన వారిపట్ల సమాజంలో వివక్ష ప్రదర్శించకూడదని ఈ మేరకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్, డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ముడా వీసీ బి.శివనారాయణ రెడ్డి, డిఎంఅండ్ హెచ్ వో డా. గీతాబాయి, డిపివో ఎస్ వి. నాగేశ్వరనాయక్, డిఆర్డిఎ పిడి పిఎస్ఆర్ ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కే సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

షోకాజ్ నోటీస్ జారీ చేయండి

- ఉయ్యూరు నగర పంచాయతీ కమిషనర్ తీరుపై జెసి ఆగ్రహం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు నగర పంచాయతీ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావుకు షోకాజ్ నోటీస్ జారీ చేసి ప్రభుత్వానికి సరెండర్ చేయాలని కృష్ణాజిల్లా రెవిన్యూ అధికారి యం. వెంకటేశ్వర్లును జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితసింగ్ ఆదేశించారు. మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన సమావేశంలో ఉయ్యూరు నగర పంచాయితీ అనధికార లే-అవుట్ల విషయమై సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ ఫిర్యాదు చేసారు. ఈ ఫిర్యాదుపై విజిలెన్స్ నివేదిక ప్రకారం 7 కోట్ల 19 లక్షల యాభై తొమ్మిది వేల రూపాయలు వసూలు చేయని విషయంలో నగర పంచాయితీ కమిషనర్‌తో మాట్లాడేందుకు జేసీ ప్రయత్నించగా కమిషనర్ అందుబాటులోనికి రాలేదు. కార్యాలయ సిబ్బంది ఎవరూ కూడా హాజరు అయి సమాధానం చెప్పనందున కమిషనర్ పి. వెంకటేశ్వర్లుకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డిఆర్ఒను జెసి ఆదేశించారు. తరువాత హాజరు అయిన సీనియర్ అసిస్టెంట్ నగర పంచాయితీ కౌన్సిల్ సమావేశంలో ఉన్నారని సమాధానం చెప్పగా సోమవారం స్పందనకు అటెండ్ కాకుండా, అనుమతి లేకుండా కౌన్సిల్ సమావేశాన్ని ఎందుకు ఏర్పాటు చేశారని, కమిషనర్ పి. వెంకటేశ్వర్లును ప్రభుత్వానికి సరెండర్ చేయమని ఆదేశించారు. మచిలీపట్నం వచ్చి కలవాలని కూడా ఆదేశించారు.

విమానాశ్రయం నుండి గుంటూరుకు ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి-గన్నవరం : విజయవాడ (గన్నవరం) అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విజయవాడ, గుంటూరు ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చేందుకు ఆర్టీసీ గుంటూరు డిపో ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు విమానాశ్ర డైరెక్టర్ యం . లక్ష్మీ కాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం విమానా శ్రయంలోని అంతర్జాతీయ టెర్మినల్ భవనం నుంచి విజయవాడ-గుంటూరు వరకు నూతన ఆర్టీసీ బస్సు సర్వీసు ను ఆయన ప్రారంభించారు. లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రయాణికులకు ప్రజా రవాణాను అందుబాటులో ఉంచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారంలో సోమవారం, బుధవారం, శనివారాల రోజుల్లో బస్సు విమానాశ్రయం లో అందుబాటులో ఉంటుందన్నారు. అనంతరం బస్సులో ప్రయాణించిన వారికి టికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు డిపో మేనేజర్ అబ్దుల్ సలాం, విమానాశ్రయం భద్రతాధికారి ఏసిపి కె.వి రత్నం, టెర్మినల్ మేనేజర్ అంకిత్ పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-ఉంగుటూరు : ప్రభుత్వం ఎన్నో రకాల స్కీమ్స్‌ను అమలు చేస్తోందని ఎండిఓ శేషగిరిరావు అన్నారు. ఉంగుటూరు మండలం ఆత్కూరులో చిరు వ్యాపారులకు పదివేల రూపాయలు అందజేసిన సందర్భంగా సోమవారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ ఏపీ సర్కార్ అందిస్తున్న పథకాల్లో వైఎస్సార్ చేదోడు కూడా ఒకటి అన్నారు.అత్కూరు గ్రామ సర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మ , గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు , ఎం.పి.టి.సి సభ్యులు పాల్గొనారు.

మాదకద్రవ్యరహిత 'కృష్ణా'గా మారుద్దాం : డిఆర్ఒ

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : కృష్ణాజిల్లాను మాదకద్రవ్య రహితగా (డ్రగ్ ఫ్రీ కృష్ణా) మార్చడానికి అధికారులు సమిష్టిగా చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. సోమవారం తన చాంబర్ లో డ్రగ్ ఫ్రీ ఇండియా కార్యక్రమంలో భాగంగా జిల్లాను మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక పై కమిటీలో సభ్యులుగా ఉన్న వివిధ శాఖల అధికారులతో చర్చించారు. ఇటీవల భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం అవుతున్న 272 జిల్లాలను గుర్తించగా అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి జిల్లాల పునర్విభజనకు ముందున్న విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కష్ణాజిల్లాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నూతనంగా ఏర్పడిన కష్ణాజిల్లాలోనూ మాదకద్రవ్యాల నివారణకు తీసుకోవల్సిన చర్యలపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాలు దుర్వినియోగం అవుతున్న ప్రదేశాలను గుర్తించి నిర్మూలనకు కమిటీలో సభ్యులుగా ఉన్న అన్ని శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్ వి.రామాంజనేయులు, ఐసిడీఎస్ పీడీ సువర్ణ, బాలల సంరక్షణ ఇన్చార్జి అధికారి జాన్సన్, డిప్యూటీ డీఈఓ సుబ్బారావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్ఒ వెంకటేశ్వర్లు

ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి

- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-బంటుమిల్లి : రైతులు, కౌలు రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో ఆర్బీకెల ద్వారా కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బంటుమిల్లి సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టార్గెట్ పూర్తయిందనే కారణంతో జిల్లాలోని కొన్ని రైస్ మిల్లుల్లో ధాన్యం సేకరణను నిలిపివేశారని చెప్పారు. జిల్లాలో 5.2 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాలని ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ సైతం త్వరలోనే పూర్వవ్వనుందన్నారు. సార్వాలో సాగైన వరి పంట నూర్పిళ్ళు ఇంకా సగం కూడా పూర్తికా లేదన్నారు. రబీలో సాగైన మినుము తీత పూర్తయ్యే వరకు ఏప్రిల్ నెలాఖరు వరకు కుప్ప నూర్పిళ్ళు జరుగుతాయన్నారు. ఈ పరిస్థితుల్లో ధాన్యం సేకరణకు కాలపరిమితిని గానీ, లక్ష్యాన్ని గానీ నిర్దేశించకుండా రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్బీకెల్లో రైతులు ఎదుర్కొంటున్న సంచుల కొరత, రవాణా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మాండూస్ తుఫాను ప్రభావానికి తడిచి రంగు మారిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలన్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలేని కారణం వల్ల ధాన్యం కొనుగోలు చేయకపోవడం వలన రైతులు చాలా ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అవసరమైతే నిబంధనలను సడలించి రైతులు వద్ద, కౌలు రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రవాణా చార్జీ హమాలి చార్జీలు, ధాన్యం సొమ్మును కూడా వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. బంటుమిల్లి మండల రైతు సంఘం కార్యదర్శి లంక దాసుల అజయ్ ఘోష్, రైతు సంఘం సీనియర్ నాయ కులు సుజ్ఞానం జనార్ధన్‌రావు, సమ్మెట నాంచారయ్య, వంగల రాజా, మాజేటి శ్రీనివాసరావు తదితరులు ఈ సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యనారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రెండో అన్నవరంగా పేరుగాంచిన గుడ్లవల్లేరులోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి 70వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 31 నుండి ఫిబ్రవరి 5వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం శ్రీవారిని పెళ్లి కుమారుని చేసే కార్యక్రమంలో ఉభయ దాతలు పొట్లూరి సత్యనారాయణ జ్యోతి దంపతులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. స్వామివారి వ్రతాలు తెల్లవారుజామున మూడు గంటలకు ప్రారంభమవుతాయని, ఉభయ దాతలు పుల్లేటి పాపారావు కష్ణ జ్యోతి పదులు ఈ కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ వ్రతాల్లో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి దంపతులు పాల్గొనాలని కోరారు. గురువారం స్వామివారి రాయబారం మహోత్సవం రామిరెడ్డి మురళి మోహన్‌రెడ్డి మంగా లక్ష్మి గహమును నిర్వహిస్తారు. శుక్రవారం స్వామివారితిరు కళ్యాణోత్సవం పులి మురళి కృష్ణ రమాదేవి దంపతులచే నిర్వహించబడతాయని తెలిపారు. శనివారం గరుడోత్సవం కాగితం రాధాకష్ణ రుక్మిణి దంపతులచే కార్యక్రమం జరుగుతుందని, ఆదివారం స్వామివారి పవళింపు సేవ, ధ్వజ అవరోహణము ద్వాదశ రక్షణములు పొట్లూరి సత్యనారాయణ జ్యోతి దంపతులు నిర్వహిస్తారని వివరించారు.

బచ్చుల అర్జునుడికి ఎంఎల్ఎ వంశీ పరామర్శ

ప్రజాశక్తి-గన్నవరం : ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడిని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సోమవారం పరామర్శించారు. విజయవాడ రమేష్ ఆసుపత్రికి వెళ్లి అర్జునుడి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో మాట్లాడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

నిర్వాసితులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-గన్నవరం : విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ విస్తరణలో ఇళ్ళు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని కోరుతూ నిర్వాసితులు సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించి నట్లు పోరాట కమిటీ నాయకులు ఏసురత్నం తెలిపారు. 2013 విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ విస్తరణలో బుద్ధవరం, దావాజీగూడెం, అల్లాపురం గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఇళ్ళు కోల్పోయిన వారికి ఇల్లు యిస్తామని మార్కింగ్ చేసి ఇళ్ల తొలగించాలన్నారన్నారు. ముందుగా ఇళ్ళ స్థలాలు ఇవ్వమని అడిగినా అధికారులు పట్టించుకోకుండా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద మీకు నష్టపరిహారం ఇస్తాం అని మోడల్ గహాలు కట్టేయిఇస్తామని నమ్మించారన్నారు. నిర్వాసితులను ఆదుకోవాలని గత నవంబర్ 8వ తారీకు నుండి ఆమరణ నిరాహార దీక్ష చేస్తూనే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎయిర్ పోర్ట్ గోడ పక్కనే ఉంటున్న తమను గాలికి వదిలేసి అధికారులు రన్ వేని నిర్మించి నిర్వాసితుల సమస్యలు పట్టించుకోకుండా ప్రతిసారీ ఏదో ఒక సాకు చెబుతూ తప్పించుకుంటున్నారన్నారు. పది రోజులలో తమ సమస్యలు పరిష్కరించకపోతే అందరం పురుగుమందు తాగుతామని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు.

పతకాలు సాధించిన మణికంఠకు సత్కారం

ప్రజాశక్తి -చల్లపల్లి : ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో రజిత, కాంస్య పతకాలు సాధించిన వక్కలగడ్డ గ్రామానికి చెందిన మురాల రాజశేఖర మణికంఠను గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. మూరు మూల గ్రామంలో పుట్టిన మణికంఠ 66వ రాష్ట్రస్థాయిల స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ లో అండర్ 17 బాలుర విభాగంలో 400 మీటర్ల పరుగులో రజకపతకం, 300 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించి వక్కలగడ్డ గ్రామ ఖ్యాతిని పెంచడాన్ని పలువురు అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వల్లూరి ఉమా, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, పాలకేంద్రం అధ్యక్షులు మల్లుపెద్ది నాగభూషణరావు, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మల్లు పెద్ది రత్నకుమారిలు పాల్గొన్నారు.

బందరు నూతన రైల్వే స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో నూతనంగా నిర్మించిన ప్రధాన రైల్వేస్టేషన్ నుండి సోమవారం రైళ్ల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు మచిలీపట్నం నుండి బెంగుళూరుకు కొండవీడు ఎక్స్‌ప్రెస్ బయలుదేరి వెళ్లడంతో రైళ్ల రాకపోకలు ప్రారంభమైనట్లు స్టేషన్ మేనేజర్ పామర్తి నాగేశ్వరరావు తెలిపారు. కొండవీడుతోపాటు మిగిలిన ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు కూడా సోమవారం నుండే ప్రారంభమయ్యాయని, మంగళవారంనుండి ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

ప్రతి నీటి బొట్టుకూ రేటే...

రాష్ట్ర ప్రభుత్వాలు రూ.38.67 కోట్లు నగరపాలక సంస్థకు మంజూరు చేయాల్సి ఉండగా, మంచినీరు, డ్రైనేజి, పార్కులు అన్నింటికీ కలిపి రూ.11.63 కోట్లు మాత్రమే విడుదల చేశాయి. ఫలితంగా 251.75 కిలోమీటర్ల పైప్‌లైన్లు వేయలేకపోయారు. నీటి మీటర్లు ఏర్పాటు చేస్తే స్వయం సమృద్ధి రేటు ప్రకారం ఆస్తి పన్ను ఆధారంగా నీటి ఛార్జీలు పెరుగుతాయి. వ్యక్తిగత నివాసాలకైన ఖర్చుకనుగుణంగా నెల బిల్లు వసూలు చేస్తారు. ఆస్తి పన్ను రూ.250 ఉన్న వారికి 50 శాతం, అలాగే రూ. 250పైన ఆస్తి పన్ను వచ్చిన వారికి 100 శాతం మంచినీటి చార్జీలు పెరుగుతాయి. అలాగే బల్క్ హౌసెస్, అపార్ట్‌మెంట్లకు 150 శాతం, కమర్షియల్ క్యాటగిరీ వాటికి 200 శాతం, పరిశ్రమలకు 150 శాతం చొప్పున మంచినీటి ఛార్జీలను పెంచి వసూలు చేస్తారు. అమృత్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచినీటి సరఫరాకు రూ.100.07 కోట్లు కేటాయించాయి. వీటిలో రూ.24.17 కోట్లు కేంద్ర ప్రభుత్వ వాటా కాగా, రాష్ట్రం వాటా రూ.14.50 కోట్లు, విఎంసి వాట సొమ్ము రూ.4.16 కోట్లు, 14వ ఆర్థిక సంఘం నుండి బదిలీ చేసిన నిధులు రూ.57.24 కోట్లు ఉన్నాయి. కానీ ఆచరణలో 2015 నుంచి ఇప్పటి వరకు కేవలం రూ.11.63 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి.

విశ్రమించేదిలేదు

బృందంలో విద్యార్థి, యువజన సంఘాల రాష్ట్ర నేతలు ఉన్నారు. మచిలీపట్నం కోనేరు సెంటరులో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.పవన్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ విశ్వనాథ్, కృష్ణాజిల్లా ప్రజా సంఘాల నాయకులు కె.సుకేష్ ఎస్.సమరం, ఎల్.దత్తు, అధ్యక్షులు వరుణ్, నవీన్, మణికంఠ, కీర్తి, రోహిత్, రాకేష్, ఫద్వీ, బాజీ బాబు తెల్లాకుల తదితరులు పాల్గొన్నారు. విజయవాడలో యాత్రకు ఎస్ఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సోమేశ్వరరావు, సి.హెచ్.వెంకటేశ్వరరావు, డివైఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.కృష్ణ, ఎన్.నాగేశ్వరరావు, పిడిఎస్‌యూ నగర కార్యదర్శి ఐ.రాజేష్, ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి సాయి తదితరులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు, పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఐ రాష్ట్ర నాయకులు అక్కినేని వనజ, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పిడిఎస్‌యూ నాయకులు ఏ.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. గన్నవరంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ నాయకులు పెద్ది వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

డిఆర్ఒ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్.సిహెచ్.శ్రీనివాస్

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

డిఆర్ఒ, డిపిఒలకు సిఐటియు వినతి

ప్రజాశక్తి - విజయవాడ : గ్రామపంచాయతీల కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, వేతన బకాయిలు చెల్లించాలని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన 'స్పందన'లో కార్మికుల సమస్యలపై డిఆర్ఒ, డిపిఒలకు వినతిపత్రాలు సమర్పించారు. పారిశుధ్య విభాగంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) మిత్రలు (గ్రీన్ అంబాసిడర్లు) అనేక ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని, వీరికి అనేక గ్రామపంచాయతీల్లో 10 నెలల నుండి 24 నెలల వరకు వేతనాలు బకాయిలు ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని, అప్పులు చేసి బతుకులీడుస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, పంచాయితీ అధికారులు వెంటనే స్పందించి వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. చందర్లపాడు మండలం కొనాయపాలెంలో ఆరుగురిని, చింతలపాడులో నలుగురిని, వెలది కొత్తపాలెంలో ఐదుగురిని, మైలవరం మండలం వెల్వడంలో 11 మందిని విధుల నుండి ఆకస్మికంగా తొలగించారని పేర్కొన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వీరి వేతనాల చెల్లింపునకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిఐటియు మైలవరం మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్, చందర్లపాడు మండల కార్యదర్శి వి.యేసోబు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ చందర్లపాడు మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లాలోని వివిధ పంచాయితీల్లో వేతన బకాయిలున్న, తొలగించబడిన గ్రామపంచాయతీ కార్మికులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో బొడ్డు నాగేశ్వరరావు, గన్నే వెంకటరావు, కర్రా వరప్రసాద్

నేడు గన్నవరం బాలోత్సవం

ప్రజాశక్తి - గన్నవరం : విద్యార్థుల్లో సజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు మంగళవారం గన్నవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలోత్సవం నిర్వహించనున్నట్లు గన్నవరం బాలోత్సవం కమిటీ అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...బాలోత్సవం అకడమిక్, కల్చరల్ విభాగాల్లో జరిగే పోటీల్లో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లోని 40 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన సుమారు 1550 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. చిత్రలేఖనం, డ్రాయింగ్, వ్యాసరచన (తెలుగు, ఇంగ్లీషు), డిబేట్ (తెలుగు, ఇంగ్లీష్), స్పెల్ బి(ఇంగ్లీష్) మాప్, మట్టితో బొమ్మల తయారీ, కథలు చెప్పటం, తెలుగులో మాట్లాడటం, పద్యాభావం, మెమొరీ టెస్ట్, ఏకపాత్రాభినయం, ఫాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ, దేశభక్తి గీతాలాపన, క్లాసికల్ డ్యాన్స్, బందగానం, జానపద నత్యం, కోలాటం పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు, బాలోత్సవం కార్యనిర్వాహక అధ్యక్షుడు గన్నే వెంకటరావు, బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్
టిడిపిలో చేరినందుకు వైసిపి నేతల వేధింపులే కారణమని ఆరోపణ

ప్రజాశక్తి - కంచికచర్ల : వైసిపి నుండి టిడిపిలో చేరిన వారిపై వేధింపులతో పాటు అక్రమ కేసులు బనాయించటంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాలపడిన సంఘటన కంచికచర్ల మండలం కీసర గ్రామంలో జరిగింది. కీసర గ్రామానికి చెందిన యరగొర్ల విజయ్ సోమవారం ఉదయం పెండ్యాల వెళ్లే రోడ్డులోని రియల్ ఎస్టేట్ వెంచర్లోకి పురుగు మందు డబ్బాతో వెళ్లాడు. దానిని తాగే ముందు తన సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. విజయ్ పురుగు మందు తాగుతున్న విషయాన్ని గమనించిన మరో వ్యక్తి అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అయితే ఈలోగానే కొంత పురుగు మందు తాగాడు. వెంటనే అతడని అంబులెన్స్‌లో నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం...యరగొర్ల విజయ్, వినయ్ వరుసకు సోదరులు. కొద్ది నెలల క్రితం వీరు వైసిపిని వీడి టిడిపిలో చేరి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దీన్ని తట్టుకోలేక గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు, అతని సోదరుడు పథకం ప్రకారం విజయ్, వినయ్‌లను లక్ష్యంగా చేసుకున్నారు. కొద్ది నెలల క్రితం కీసర టోల్‌గేట్ సమీపంలోని విజయ్ కూల్ డ్రింక్ షాపు వద్దకు అర్ధరాత్రి సమయంలో మద్యం తాగి వచ్చిన అధికొర పార్టీ నాయకుడి సోదరుడు బైక్‌పై వచ్చి అక్కడ పనిచేసే మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విజయ్ ప్రోద్భలంతోనే తనపై ఫిర్యాదు చేసిందనే ఉద్దేశంతో విజయ్ కుటుంబంపై అధికార పార్టీ నేతలు కక్ష పెంచుకున్నారు. విజయ్‌పై ఇతరులతో వైసిపికి చెందిన ఇద్దరు సోదరులు అక్రమంగా కేసులు పెటించారు. అంతేగాకుండా రౌడీషీటు కూడా బనాయించారు. కంచికచర్ల పోలీసులు ఇటీవల విజయ్‌కు ఫోన్ చేసి సంతకాలు పెట్టేందుకు పోలీసుస్టేషన్‌కు రావాలని కోరారు. స్టేషన్‌కు వచ్చిన విజయ్‌కు రౌడీ షీటు ఓపెన్ చేసిన విషయాన్ని చెప్పారు. అంతేగాక ప్రతి ఆదివారం సంతకం పెట్టేందుకు రావాలని చెప్పారు. దీంతో విజయ్ తాను ఏం తప్పు చేశానని రౌడీషీటు ఓపెన్ చేస్తారని ప్రశ్నించాడు. దీంతో పోలీసులు అతడిని దుర్భాషలాడారు. మనస్తాపం చెందిన విజయ్ సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడికి నందిగామ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నందిగామలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న విజయ్‌ను నందిగామ మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య పరామర్శించారు.

IN THE COURT OF I ADDL., JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. NO. 55/2020

BETWEEN:-
SYNDICATE BANK NOW CANARA BANK, BUCKINGHAMPET BRANCH VIJAYAWADA, REPTD. BY ITS CHIEF MANAGER ... **PLAINTIFF**
AND
POTLA SUNEETHA AND ANOTHER ... **DEFENDANTS**

1st Defendant:- Potla Suneetha W/o Rajpaul, residing at Door No: 47-1-19, Lurdu Nagar, Near Marymatha Temple, Gundala, Vijayawada - 520.
2nd Defendant:- Gontupulugu Melkiar S/o. (Late) Venkata Ratnam, residing at Door No: 50-6-10, Veternary Street, Near Panchayat Office, Gunadala, Vijayawada.

Please take summons that the above suit is filed against you and the same is posted on 07-02-2023 for your appearance.

Therefore you are hereby directed to appear on 07-02-2023 at 10.30A/M, either in person or through your Advocate before the Honourable Court and in default the matter will be decided exparte.

(By Order of The Honourable Court)

MD. HAYAD B.COM., B.L., ADVOCATE
#41-9-18, L.R.K. TOWERS, SF-2, 2nd Floor, Ramalayam Street, Naidupeta, Krishna Lanka, Vijayawada-13.

In the Court of the I Addl Junior Civil Judge at Vijayawada
IA No: 206/2021 in OS No 936/2018

Between:
1. Atmuri Vandana W/o, Anil Kumar Represented by GPA holder A.T. Srinivasa Rao ...**Petitioner / Plaintiff**
AND
1. Sri Syamala Medical Corporation APartner Ship Firm rep by its MG. Partner T.S.S.K.P. Vital and other□s
... **Respondent□s / Defendent□s**
To, Proposed Defendat□s
4. Smt. Tammana Hymavathi W/o. Chinna Brahmaji Rao, R/o. D.No: 6-19-26A, Ground Floor, Gunnabathula Atchaiah Street, Beside KBN College, Kothapet, Vijayawada -1.
C/o. Tammana Prasad S/o. China Brahmaji Rao, R/o, Tallapalem Village, Tallapalem Post, Via Chilakalapudi, Krishna District.
C/o. Tammana Rama Mohan Rao , S/o. China Brahmaji Rao, R/o. Flat No 24, 1st Floor, GF-1 of Babu Enclave Maruthi Nagar, Pantakalava Road, Patamata, Vijayawada-10.

Please take notice that the above petition / suit posted to 17-02-2023. For your Appearance you are here by called upon to appear in person or through your advocate before the Hon□ble cast on that day at 10.30 AM failing which exparte order will be passed against you.

D.Pitchaiah
DP Ramakrishna,
Advocate for Petitioner / Plaintiff

IN THE COURT OF THE HONBLE XII Addl.District JUDGE at VIJAYAWADA
M.V.OP.NO:45/2022

Between:
Merakanapalli Siva NagaRaju and Another - Petitioners
and
Tanukula Satyanarayana and Another -Respondents.

To,
Tanukula Satyanarayana S/o, Sitaramaiah Driver Cum owner of Lorry bearing No. AP39TA1569, R/o D.No. 4-25/A, Near Narayanapuram Ramalayam, UTUKURU, Mudinepalli Mandal, Krishna District-R1
పై నెంబరు పిటీషన్‌లోని 1వ రెస్పాండెంట్ అయిన మీరు పైకోర్టు వారి ఎదుట హాజరు నిమిత్తము ది.2-3-2023నకు వాయిదా అయి ఉన్నది.కావున మీరు పై తేదిన ఉ॥10.30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకోవలెను లేని యెడల పిటీషన్ మీపై పరోక్షముగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

(By Court Order)

వై.పి. మహేష్
పిటీషనర్స్ తరుపున న్యాయవాది
విజయవాడ

Before The Honb;e Judge, Principal Family Court at Vijayawada
FCOP.No: 278/2022
(For Maintenance)

మధ్యన:
బోసు లిఖిత్ సాయి (రిప్రజెంటెడ్ బై (శ్రీమతి మంగమ్మ) ...పిటీషనర్
మరియు
బోసు సుధాకర్ ... రెస్పాండెంట్

పై నెంబర్ గల పిటీషన్ నందు పిటీషనర్ నెలవారీ మెంటెనెన్స్ కోరుతూ పై నెంబరు గల పిటీషన్‌ను దావాలు చేయగా, రెస్పాండెంట్ అయిన నీవు పైకోర్టు వారు దావా సమన్లు జారీ చేయగా నీవు స్వీకరించకుండా కాలయాపన చేస్తున్నందున సదరు శ్రీకోర్టు వారు సబ్‌స్టిట్యూట్ సర్వీసుగా అనగా పేపరు ప్రకటన నోటీసు జారీ చేస్తు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం నీవు 13-02-2023వ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30ని॥లకు హాజరై నీ ఆక్షేపణలు స్వయంగా కాని, లేక వకీలు ద్వారా గాని తెలియజేయగలవు. లేని ఎడల నీపై పరోక్షంగా కోర్టు తీర్మానం చేయగలరని ఇందుమూలముగా తెలియచేయడమైనది.
వాయిదా తేదీ: 13-02-2023

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బోసు లిఖిత్ సాయి
(మైనర్ అయినందున రిప్రజెంటెండ్ బై
శ్రీమతి వి.మంగమ్మ (అమ్మమ్మ), విజయవాడ

NANDIGAMA NAGARA PANCHAYAT
'e' Procurement Tender Notice Roc No: 382/2022/E1, Dt: 28-01-2023.

Sl. No	Name of the Grant	No of works	Estimate Amount (in Lakhs)	Opening date	Closing date
1	General Funds	8	33,58,300/-	31-01-2023	03-02-2023
2	15th FC	3	19,88,300/-	31-01-2023	03-02-2023
Total			56,46,600/-		

Note: All rights are reserved to the Commissioner to cancel or Reject the tenders without any reasons (As per G.O.Ms No.94, Dt.01.07.2003 I & CAD) Further details can be seen @ 'e' procurement market place @ www.tender.apeprocurement.gov.in

1. Download of bid documents starts from : 31-01-2023 @ 11:00 A.M
2. Last Date /time for receipt of tenders : 03-02-2023 @ 11:00 A.M
3. Bid Closing : 03-02-2023 @ 05:00 P.M.

Contact No: 9490781856, 8341509213

Commissioner
Nandigama Nagar Panchayat

గాంధీజీ ఆశయానికి తూట్లు పొడుస్తున్న పాలకులు

- మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గన్నవరం : కేంద్రంలోని పాలకులు గాంధీజీ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు విమర్శించారు. గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన గాంధీజీ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గాంధీజీ ఒక మహత్తర ఆశయంతో దేశానికి స్వాతంత్రం తెచ్చారని, కానీ నేటి బిజెపి పాలకులు ఆయన ఆశయాలకు తిలోదకాలు ఇస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని చెప్పారు. ప్రజలంతా ఏకోన్ముఖంగా బిజెపిని వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, గన్నె వెంకట్రావు, హెచ్‌ఎం అనిత పాల్గొన్నారు. తొలుత గాంధీ జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులు అర్పించారు. అలాగే భారతదేశ స్వాతంత్ర సంగ్రామంలో అహింస అనే ఆయుధంతో నాయకత్వం వహించి స్వాతంత్రం తీసుకు వచ్చిన వ్యక్తి గాంధీజీ అని నవభారత్ స్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమామ్ తెలియజేశారు. సోమవారం గాంధీజీ విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులు అర్పించారు. షేక్ జాకీర సుల్తానా, షేక్ హసీనా, రామరాజు రామభద్రరాజు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోట విజయ రాధిక, సిబ్బంది మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలు వేసే నివాళులర్పించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, పంచాయతీ ఈవో పడమట సుకుమార్ గాంధీ చక్రవడానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. **ప్రజాశక్తి-గుడివాడ :** ఎన్‌టిఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ అధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు.క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి, ట్రజరీలు అర్జా ప్రసాద్, వంగపండు బ్రహ్మాజీ, చింతా రామకృష్ణ, ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ సభ్యులు బొగ్గవరపు తిరుపతయ్య, మెరుగుమాల శివరామకష్ణ పాల్గొన్నారు. అలాగే స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి భారత్ వికాష్ పరిషత్ అధ్యక్షులు మెరుగుమాల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్పందన సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. సత్యం, శాంతి, అహింసలే ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్యం సంపాదించి చరిత్రపై మహాత్మా గాంధీ చెరగని ముద్ర వేశారని, నేటి తరం ఆయనను స్ఫూర్తిగా తీసుకొని జాతి సమైఖ్యత కోసం పోరాడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. డిఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు మహాత్మా గాంధీకి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.అలాగే మచిలీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ బాబా ప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇలియాస్ పాషా, కార్యదర్శి వెంకన్న, కార్పొరేటర్లు రాళ్లకొట్టు రాము, డిద్ధకుంట సుధాకర్, బీసీ సెల్ అధ్యక్షులు గోకుల్ శివ పాల్గొన్నారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డలో వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు వైసీపీ పార్టీ కార్యాలయం వద్ద గాంధీ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీ దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజక వర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, గ్రామ ఉపసర్పంచ్ గాజుల జై గోపాల్ తదితరులు పాల్గొన్నారు. టిడిపి పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో గాంధీ విగ్రహానికి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ పూలదండలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కునపురెడ్డి చంద్రశేఖర్, ఎలవర్తి చిన్న, బర్మా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు గాంధీ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం కష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఫైర్ స్టేషన్ వద్ద గల గాంధీ పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గంటసాల కన్నయ్య, కోడూరు సత్యనారాయణ, ఘంటసాల ప్రసాద్, దేశ జగన్మోహన్రావు అద్దేపల్లి ప్రసాద్, గార్లపాటి గోపి, మానేపల్లి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి :** మండలంలోని పాములపాడు పాములపాడు సచివాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, కార్యదర్శి సాగరరాణి, వైసీపీ నాయకుడు రాజేష్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరంలో మాట్లాడుతున్న బొడ్డు నాగేశ్వరరావు

అవనిగడ్డలో...

కలెక్టరేట్‌లో..

గుడివాడలో...

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు, బాధితులు

చింతలమడ బాధితులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ : గత ఏడాది చింతలమడ గ్రామానికి చెందిన పెళ్లి బందం పెదప్రోలు వస్తుండగా కాసా నగరం వద్ద ప్రమాదానికి గురై అయిదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మతి చెందగా మరో 17 మంది తీవ్ర గాయాలకు గురయ్యారు. దీనితో ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయము అందకపోవడంతో తాజాగా బాధితులు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబును కలసి తమగోడు వెళ్లబోసుకున్నారు. ప్రమాదం జరిగిన రెండో రోజునే ఎమ్మెల్యే ద్వారా జిల్లా కలెక్టర్ ఆర్థిక శాఖ కార్యదర్శి కి కూడా లేఖ రాయడం జరిగిందని, అయినప్పటికీ తమకు ఎటువంటి సహాయ సహకారాలు అందలేదన్నారు. అందువల్ల తమరు కలగజేసుకొని ముఖ్యమంత్రికి తమ సమస్య చెప్పడం ద్వారా తగు న్యాయం సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చల్లపల్లి మండల పార్టీ కార్యదర్శి యద్దనపూడి మధు, మండల కమిటీ సభ్యులు ఎండి కరిముల్లా, బండారు కోటేశ్వరరావు, గుర్రం ఎలీషా రావు పాల్గొన్నారు

కుట్టుమిషన్లు అందిస్తున్న దృశ్యం

కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-పెదపారుపూడి : దాతల సహకారం మరువలేమని పామర్రు టిడిపి ఇన్చార్జి వర్ల కుమార్ రాజా అన్నారు. సోమవారం వెంట్రప్రగడ గ్రామంలో టీడీపీ కార్యాలయం వద్ద తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లు, కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తానా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణకు కుమార్ రాజా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (చంటి)కార్యదర్శి మసిముక్కు రాంబాబు టిడిపి మండల యువత అధ్యక్షులు కూచిపూడి నాగ ఆదిత్య మాజీ ఎంపీపీ కాజా విజయలక్ష్మి గుండమనేని శ్రీనివాసరావు (స్వామి)కలపాల కిషోర్ సత్యనారాయణ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

త్వరలో భవిష్యత్ కార్యచరణ : డివై దాస్

ప్రజాశక్తి - మొవ్వ : మాజీ ఎంఎల్ఏ డివై దాస్ మొవ్వ మండలంలో విసృతంగా పర్యటిస్తూ ప్రజల మద్దతు కూడగడుతున్నారు. మొవ్వ ,నరసన్నపాలెం గ్రామాలలో పర్యటించి పరిచయస్తులను కలుస్తున్నారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై గ్రామస్తులతో ముచ్చటించారు. అందరి అభీష్టం మేరకు త్వరలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.వాసు ,శ్రీనివాస రెడ్డి, అనన్య ,శ్రీను, భరత్ ఉన్నారు.

వర్గీకరణ బిల్లు పెట్టాలి

ప్రజాశక్తి-గన్నవరం : ఫిబ్రవరి 3వ తేదీ నుండి జరగబోయ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనైనా ఏబీసీడీ ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదింపచేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచేటి మురళీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ పార్కులో జరిగిన సమావేశంలో మురళీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెల్లిపాడు సర్పంచ్ లాం. నాగేశ్వరరావు, కాటూరి, రవి, పాపారావు, రామారావు కొక్కిలిగడ్డ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

'గాంధీయే మార్గం' గ్రంథావిష్కరణ

పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రపంచ మానవాళికి గాంధీయే మార్గమని అమెరికాలోని డోలాస్ నగరం గాంధీ మెమోరియల్ చైర్మన్ డాక్టర్ తోటకూర ప్రసాద్ తెలిపారు. సోమవారం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ క్షేత్ర కమిటీ గ్రామీణ యువజన వికాస సమితి, దివిసీమ లలిత కళా సమితి, దివిసీమ బాలానంద సమితి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'గాంధీయే మార్గం' గ్రంథావిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా గాంధీజీ సిద్ధాంతాలపై అధ్యయనం జరుగుతుందని ప్రస్తుత అశాంతి పరిస్థితుల్లో గాంధీ సిద్ధాంతాలను ఆయన మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలన్నారు. అమెరికాలో గాంధీ సిద్ధాంతాలకు ప్రాచుర్యం ఎక్కువగా ఉందని అనేక విశ్వవిద్యాలయాల్లో గాంధీ తత్వం పై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ గాంధీజీ దేశానికి అందించిన మహోన్నత విలువల నుంచి మనం దూరం కావడం విచారకర మన్నారు. గాంధీ మార్గం చదివితే గాంధీజీ జీవిత దక్పథం ప్రపంచానికి ఆయన అందించిన మహోత్తర సందేశం అర్థమవుతుందని గాంధీ సిద్ధాంతాలను నేటి తరానికి అందించడానికి నాగునూరి వేణుగోపాల కషి ప్రశంసనీయమన్నారు. అనంతరం గాంధీ ఏ మార్గం గ్రంథాన్ని రాటకూర ప్రసాద్ ఆవిష్కరించార. గాంధీ వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన చిత్రలేఖను వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కమిటీ కార్యదర్శి మతి శ్రీనివాసరావు, ఇది సినిమా లలిత కళా సమితి కార్యదర్శి కోనపురెడ్డి చంద్రశేఖర్, మాజీ జడ్పిటిసి కొల్లూరి వెంకటేశ్వరరావు, పుప్పాల ఆంజనేయులు పాల్గొన్నారు

సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-మోపిదేవి : ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అవనిగడ్డ శాసన సభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మోపిదేవి మండల పరిధిలోని మెరకనపల్లి గ్రామ సచివాలయ పరిధిలో చిరువోలు బిసి కాలనీ, టేకుపల్లి గ్రామాలలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఆ కుటుంబం పొందిన లబ్దిని వివరించడంతో పాటు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ కేంద్రంలోని చిన్నారులతో సింహాద్రి ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసి సభ్యునికి అభినందనలు

ప్రజాశక్తి పెదపారుపూడి : గుంటూరులో జరిగిన ఏపీఆర్ఎస్ఏఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో పెదపారుపూడి గ్రామ రెవెన్యూ అధికారి చాట్ల అజయ్ కుమార్‌ను రాష్ట్ర ఈసీ మెంబర్గా ఎన్నుకున్నారు. సోమవారం మండలంలోని తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది, విఆర్ఓ, వీఆర్ఏలు అజయ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

బహిరంగ వేలంలో రూ.73 వేల ఆదాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో వేంచేసియున్న శ్రీలంకమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన ఘటం బిందెలు, చీరలతో పాటు పాత ఇనుము కూడా సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మచిలీపట్నం డివిజన్ దేవాలయాల తనిఖీ అధికారి కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో రూ 73 వేల రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో పి సీతారామయ్య తెలిపారు. ఇందులో చీరలకు రూ 32000, ఘటం బిందెలకు రూ 13600, పాత ఇనుమునకు రూ 28,050 ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చింతలపూడి బాల భాస్కరరావు(బాలు) ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

అదే జోరు

రెండో రోజూ ఆద్యంతం ఆకట్టుకున్న అమరావతి బాలోత్సవం

ప్రజాశక్తి-వన్‌టౌన్: కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న అమరావతి బాలోత్సవం సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లల్లో జోష్‌ను నింపాయి. రెండో రోజు సోమవారం 3,600 మంది విద్యార్థినీ విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా జూనియర్ విభాగంలో జానపద నృత్యాలు, జానపద గీతాలాపన, దేశభక్తి, అభ్యుదయ గీతాలాపన, క్లాసికల్ డాన్స్, లఘు నాటికల్లో చిన్నారులు పాల్గొని అలరించారు. అలాగే సైన్సు ఎగ్జిబిషన్‌లో జూనియర్స్, సీనియర్స్, కార్టూన్‌లో జూనియర్స్, చిత్రలేఖనంలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. మెమొరి టెస్ట్‌కు సబ్ జూనియర్స్, జూనియర్స్, కథా రచనలో జూనియర్స్, వ్యాసరచన (తెలుగు), జూనియర్స్, సీనియర్స్, వ్యాసరచన (ఇంగ్లీష్), స్పెల్ బి, మాప్ పోటీలలో జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

ఆద్యంతం ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

బాలోత్సవంలో రెండో రోజు వివిధ సాంస్కృతికాంశాల్లో పోటీలు జరిగాయి. 'నేలమ్మ నేలమ్మ నీకు వేలు వేలు వందనాలమ్మ', 'కొండ కోనల్ల నడుమ మల్లెలు', రైతు రైతు రైతో అరుగాలం కష్టించే రైతు అంటూ పిల్లలు చేసిన జానపద నృత్యాలు ప్రేక్షకులను కట్టి పడేశాయి. "ముద్దుగారే యశోద", "వచ్చేను అలివేలు మంగ", "తాండవ నృత్యగరీ", శివాష్టకం, భావములోన భాగ్యములోన", "దశావతారాలు" వంటి శాస్త్రీయ నృత్యాల పాటలతో చిన్నారులు అద్భుతంగా చూపరులను ఆకట్టుకున్నారు. జాపనద గీతాలాపనలు, దేశభక్తి గాతాలాపనలు మంత్ర ముగ్ధులను చేశాయి. కృష్ణలంక సాయి పబ్లిక్ స్కూల్‌కు చెందిన చిన్నారులు 'కరోనా సమయంలో ప్రజలు పడిన ఇబ్బందులపై' లఘునాటికను ప్రదర్శించి ఆకట్టుకున్నారు, అలాగే మొగల్రాజపురంలోని రిజోనెన్స్ స్కూల్‌కు చెందిన చిన్నారులు యుద్ధంలో సైనికుల వ్యవహార తీరును కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.

అద్భుతం సైన్స్ ఎగ్జిబిషన్

జూనియర్స్, సీనియర్స్ విభాగంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాఠవాలను చాటుకున్నారు. గన్నవరం స్రవంతి హైస్కూల్‌కు చెందిన జయ ఆదిత్య విద్యార్థి "హైడ్రాలిక్ ఫుట్‌పాత్" పరికరాన్ని తీర్చిదిద్దాడు. హైడ్రాలిక్ ట్రీ షిఫ్ట్ మెషిన్‌ను నూజివీడు కుమార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన సిహెచ్.హాసిని ప్రదర్శించి అబ్బురపరిచింది. గుంటుపల్లి సెయింట్ ఆన్స్ స్కూల్‌కు చెందిన చిన్నారి ఖాజా జియావుద్దీన్ ఏటిఎం మిషన్ నమూనా తయారు చేసి ఆకట్టుకున్నాడు. చిత్రలేఖనంలో జూనియర్, సీనియర్స్ సుమారు 650 మంది పాల్గొని పలు రకాల చిత్రాలను గీశారు. కార్టూన్ గీయటంలోను సత్తా చాటుకున్నారు. ఈ కార్యక్రమాలను బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, అధ్యక్షులు ఎస్.పి.రామరాజు, బాలోత్సవాల రాష్ట్ర సమన్వయకర్త పి.మురళీకృష్ణ, జి.జోత్స్న, పారిశ్రామిక వేత్త బాయన వెంకటరావు, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, కె. వెంకట్, ఎ.వి.రామరాజు పర్యవేక్షించారు.

మూఢనమ్మకాలను వీడండి

ప్రజాశక్తి-వన్‌టౌన్: సమాజంలో పరిడిల్లుతున్న మూఢనమ్మకాలను వదిలేయాలని జెవివి రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ చల్లా రవికుమార్ విద్యార్థులకు సూచించారు. బాలోత్సవం ఐదవ పిల్లల పండుగ రెండవ రోజు సోమవారం కెబిఎన్ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో "విద్యార్థులు – శాస్త్రీయ ఆలోచన" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కెబిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ వంగల నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో చల్లా రవికుమార్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి విషయాన్ని ప్రశ్నించడంతో పాటు సమాధానాన్ని రాబట్టాలన్నారు. సైన్సుకు, టెక్నాలజీకి ఉన్న తేడాను ఆయన వివరించారు. సైన్సుతో పాటు టెక్నాలజీ కూడా అభివృద్ధి చెందటంతో మానవుడు అన్ని రంగాల్లో ముందుకు దూసుకు వెళ్తున్నాడని తెలిపారు. మానవుడు నిప్పు కనిపెట్టిన దగ్గర నుంచి ఆవిరి యంత్రాలు రావడంతో అభివృద్ధి సాధ్యమైందన్నారు. మనుగడ కోసం మనిషి పోరాటం చేయాల్సిందేనన్నారు. ప్రకతిలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించి అందుకు అనుగుణంగా సమాజం ముందుకు సాగడం వల్లే వ్యవసాయ విప్లవం మొదలై గ్రామాలు అభివద్ధి చెందాయని చెప్పారు. టెక్నాలజీ అభివద్ధి చెందడంతో పట్టణాలు అభివద్ధి అయ్యాయని వివరించారు. ఒక విషయం మీద ప్రయోగం చేసినప్పుడు 99 సార్లు విఫలమైనా వెనకడుగు వేయకూడదని, వందో సారి విజయం సాధించాలని అన్నారు. నిర్ధారణ, రుజువులకు మించినదే సైన్సు అని తెలిపారు.

ఇదే కాన్ఫరెన్స్ హాలులో "విద్యార్థులు – సైన్స్"పై జరిగిన సదస్సులో డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ పాల్గొని మాట్లాడుతూ సమాజంలో విజ్ఞానం గురించి ప్రతిఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతోనే దేశం అభివద్ధి చెందుతుందన్నారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన మాటలు నేటికీ అనుసరణీయమన్నారు. వాస్తవాన్ని ప్రయోగంగా మార్చి అభివద్ధి చేయాలని చెప్పారు. ప్రతిఒక్కరికీ ప్రాథమిక హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయని చెప్పారు. లింగ సమానత్వంతో పాటు మానవ సమానత్వం ఉండాలని చెప్పారు. పేద, గొప్ప తేడాలేని సమాజం కోసం కషి చేయాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు. ప్రకతిని కాపాడితే అది ప్రజలకు కాపాడుతుందని గుర్తుంచుకోవాలన్నారు. కాలానికి అనుగుణంగా సైన్సు కూడా మారుతుందని చెప్పారు. ఈ సదస్సులో అమరావతి బాలోత్సవం అధ్యక్షులు ఎస్‌పి రామరాజు, బాలోత్సవాల రాష్ట్ర సమన్వయకర్త పి.మురళీకష్ణ, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, జ్యోత్స్న, యార్లగడ్డ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర మాజీ అధ్యక్షులు రవికుమార్

మాట్లాడుతున్న డాక్టర్ తుమ్మల శ్రీకుమార్

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.